# నీటి సంఘాలు లేనట్లేనా?

- 14 ఏళ్లుగా కమిటీలకు ఎదురుచూపులు
- 2010 ఓటర్ల సవరణతోనే నిలిచిన ప్రక్రియ
- 2015లో ఎన్నికలు తిరస్కరించిన గత ప్రభుత్వం
- చెరువులు, కుంటలపై పర్యవేక్షణ కరువు
- జిల్లాలో 666 చెరువులు... మూడు ప్రాజెక్టులు
- వానాకాలం సాగు 2.42 లక్షల ఎకరాలు



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

చెరువులు, కుంటల నిర్వహణ, పర్యవేక్షణలో కీలకంగా పనిచేసినా నీటి సంఘాలకు గత ప్రభుత్వం మంగళం పాడింది. దాదాపు 14 ఏళ్లుగా నీటి సంఘాలకు ఎన్నికలు లేకపోవడంతో నీటి వినియోగంపై అజామాయిషీ లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో అదర్శ రైతుల విధానాన్ని రద్దు చేసి రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసింది. వారికే చెరువుల బాధ్యతలు కూడా అప్పగిస్తారని భావించినా అచరణలోకి రాలేదు. కొత్త ప్రభుత్వం రైతు సమన్వయ సమితులను రద్దు చేసింది. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్నా 666 చిన్న నీటి వనరులు, చెరువులు, కుంటలపై మళ్లీ నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి పర్యవేక్షిస్తారా.. వదిలేస్తారా అనే చర్చ జరుగుతోంది. జిల్లాలో ఉమ్మడి రాష్ట్ర హయాంలో 2010లో నీటి సంఘాల ఓటర్ల సవరణతోనే నిలిచిపోయింది. ఆ తరువాత 2015లో తెలంగాణ ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికల్లో కదలిక వచ్చినా తరువాత నిలిపివేశారు. భారీ వర్షాలకు ఎత్తిపోతలతో చెరువుల్లోకి నీరు చేరినా పంటలకు అనుగుణంగా నీటిని వినియోగించుకునే విధంగా పర్యవేక్షించే నీటి సంఘాలు లేకపోవడంతో రైతుల్లో ఎవరికి వారే జవాబుదారీగా మారింది. కాళేశ్వరం జలాల ఎత్తిపోతలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కీలకంగా మారింది. జిల్లాలో మూడు ప్రాజెక్టులు శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్టులతో పాటు నిజాం కాలంలో నిర్మించిన ఎగువ మానేరు ప్రాజెక్టులతో చెరువులు, కుంటలను నింపుతూ వచ్చారు. దీంతో పాటు కాళేశ్వరం 9వ ప్యాకేజీలో కోనరావుపేట మండలం మల్కపేట వద్ద నిర్మించిన రిజర్వాయర్ పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. వంద ఎకరాల పైనా అయకట్టు ఉన్నా చెరువులు 106, వంద ఎకరాలలోపు 560 చెరువులు ఉన్నాయి. గతంలో మిషన్ కాకతీయ పథకంలో కూడా దాదాపు 294 చెరువులను మరమ్మతులు చేసుకున్నారు. మిగతా చెరువులు మరమ్మ తులు జరగాల్సి ఉంది. దీంతో పాటు గత ప్రభుత్వ హయాంలో మానేరు, మూలవా గులపై 24 చెక్ డ్యాంల నిర్మాణం చేప ట్టారు. ఇందులో కొన్ని చెక్‌డ్యాంలు వరదకు కొట్టుకుపోయి వెక్కిరిస్తున్నాయి. మానేరు వాగులో కొట్టుకుపోయిన చెక్ డ్యాంలు వివాదాస్పదంగానే మారిపో యాయి. నీటి సంఘాలు లేకపోవడంతో చెరువులు మరమ్మతులు, కొట్టుకుపోయిన చెక్ డ్యాంలు, ఇతర పనుల గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారే లేకుండా పోయారు. నీటి సంఘాల ఎన్నికలపై కొత్త ప్రభుత్వమైనా స్పందిస్తుందని రైతులు భావిస్తున్నారు.



రుద్రంగిలోని చెరువు

### ● జిల్లాలో 2.42 లక్షల ఎకరాల్లో సాగు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలంలో 2 లక్షల 42 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. యాసంగిలో 1.77 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుంది. సాగుకు సంబంధించిన ఆయకట్టు రైతులు చెరువుల నీటిని రైతు సంఘాల ద్వారా క్రమబద్ధంగా వాడుకునేవారు. ప్రస్తుతం నీటి సంఘాలు లేకపోవడంతో రైతుల నుంచి నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో జిల్లాలో 2.42 లక్షల ఎకరాలు సాగు చేస్తుండగా ఇప్పటి వరకు 2 లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు వేసుకున్నారు. ఈ సారి వానాకాలం సీజన్‌లో వరి 1.83 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 1510 ఎకరాలు, పత్తి 49210 ఎకరాలు, కందులు 1502 ఎకరాలు, పెసర 348 ఎకరాలు, ఇతర పంటలు 599 ఎకరాలు, ఉద్యానవన పంటలు 6,900 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

## 21న బంద్‌ను విజయవంతం చేయాలి

- మాల సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ తుంగ శివరాజ్ పిలుపు




మాట్లాడుతున్న తుంగ శివరాజ్

తంగళ్లపల్లి, ఆగస్టు 19: వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 21వ తేదీన తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని మాల సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ తుంగ శివరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం తంగళ్లపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో రిజర్వేషన్లను తొలగించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. 21వ తేదీన నిర్వహించే బందుకు వాణిజ్య, వ్యాపార, విద్యాసంస్థలు మద్దతు పలికాలని కోరారు. ఈ సమావేశంలో మాల సంఘాల నాయకులు మేడి అంజయ్య, నాలుక సత్యం, రోడ్డ రామచందర్, జక్కుల యాదగిరి, బూర యాదగిరి , బొల్లం గణేష్, నీరటి శ్రీనివాస్, బండ చంద్రశేఖర్, రాజు, క్యారం జగత్ కుమార్, నంటి లాజర్, లింగం ప్రవీణ్, మీన సుధీర్, మీస ప్రేమ్, మీసాల బాలరాజ్, పండుగ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి




ఆధార్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీఎస్ఎన్ఎల్ అధికారులు

సిరిసిల్ల టౌన్ ఆగస్టు 19: నూతన శాశ్వత ఆధార్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ డీజీఎం పొన్నం అజయ్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ పక్కన ఉన్న బీఎస్ఎన్ఎల్ టెలికాం సంస్థ భవన సముదాయంలో బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో నూతన శాశ్వత ఆధార్ సెంటర్‌ను ఆయన ప్రారంభించినారు. ఈ సందర్భంగా డీజీఎం అజయ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభించుకోవడం శుభపరిణామం అన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ డీఈ దొర వెంకటేశ్వర్లు, ఎస్‌డిఈఎం జనార్ధన్, తిరుమల్, జెటీవో నరేష్, జె ఈ ఈ వేంకటేశ్వర్లు సిబ్బంది బిఎస్ఎన్ఎల్ ఫ్రాంచెస్ కూస రామచంద్రం, ముష్టం విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల నిరసన




నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 19: న్యాయవాదిపై దాడికి నిరసనగా సిరిసిల్ల కోర్టులో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై నిత్యం పోలీసుల దౌర్జన్యాలకు నిరసనగా తెలంగాణ అడ్వకేట్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి కోర్టులో ప్రాక్టీస్‌చేస్తున్న పి. సంతోష్ అనే న్యాయవాదిని బోరబండ పోలీసులు ఇంటినుంచి లాక్కెళ్లి దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాద రక్షణ చట్టం బిల్లును ప్రవేశపెట్టి వెంటనే అమలు చేయాలని న్యాయవాదులు డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటి, సీనియర్ న్యాయవాదులు కోడి లక్ష్మన్, రవిందర్‌రావు, గుడ్ల కిషన్, నాగరాజు తదితరలు పాల్గొన్నారు.

## ఇల్లంతకుంట ఏఎంసీ చైర్మన్‌గా చైతన్య



ఐరెడ్డి చైతన్య



ఎలగందుల ప్రసాద్

ఇల్లంతకుంట, ఆగస్టు 19: వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా అనంతగిరి గ్రామానికి చెందిన ఐరెడ్డి చైతన్యను నియమిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యక్షుడుగా వల్లంపట్ల గ్రామానికి చెందిన ఎలగందుల ప్రసాద్‌ను నియమించింది. నూతనంగా నియామకం అయిన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు మండల కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు.

## 17 ఫీట్లకు చేరిన ఎగువమానేరు నీటిమట్టం



ఎగువ మానేరు ప్రాజెక్ట్

గంభీరావుపేట, ఆగస్టు 19 : గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మనేరు ప్రాజెక్టు నీటిమట్టం 17 ఫీట్లకు చేరింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పాల్వంచ వాగు, సిద్దిపేట జిల్లాలోని కూడవెల్లి వాగులు ప్రవహిస్తున్నాయి. ఫలితంగా ఎగువ మానేరు జలాశయంలోకి వరద నీరు వస్తోంది. మొత్తం 31 ఫీట్ల నీటి సామర్థ్యం ఉన్న జలాశయం సోమవారం నాటికి 17 ఫీట్లకు చేరింది. ఎగువ ప్రాంతంలో వర్షాలు కొనసాగితే మానేరు జలాశయం నీటిమట్టం మరింత పెరగనుంది.

## ప్రజావాణికి రాఖీ పండుగ ఎఫెక్ట్

వచ్చిన తొమ్మిది మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్



ప్రజలు లేక వెలవెలబోతున్న ప్రజావాణి ఆన్‌లైన్ కేంద్రం



కలెక్టరేట్‌లో ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, అగస్టు 19: రాఖీ పండుగ ఎఫెక్ట్‌తో సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ప్రజలు లేక వెలవెలబోయింది. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరం ఏర్పాటు చేసిన ప్రజావాణికి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, అదనపు కలెక్టర్‌ఖీమ్యానాయక్‌లతో పాటు జిల్లా అధికారులు హాజరైన ప్రజలు ఎవరూ రాకపోవడంతో గంటపాటు వేచిచూసిన జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో కూర్చొని ఎవరైనా వస్తే చాంబర్‌కు పంపించాలని అధికారులను అదేశించారు. అలాగే కలెక్టరేట్ ప్రదాన ద్వారం ఎదుట ఏర్పాటు చేసిన అన్‌లైన్‌కు వచ్చిన తొమ్మిది మందిని జిల్లా కలెక్టర్ చాంబర్‌కు పంపించడంతో వారితో జిల్లా కలెక్టర్ మాట్లాడి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా ప్రజావాణి దరఖాస్తులను జిల్లా అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల, కోనరావుపేట, ఇల్లంతకుంట తహసీల్దార్ కార్యాలయాలతోపాటు సర్వేయర్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ, సెస్, విద్యాశాఖ, ఉపాధి, వ్యవసాయశాఖలకు సంబంధించి ఒక్కొక్క దరఖాస్తులు రాగా వాటిని జిల్లా కలెక్టర్ స్వీకరించారు.

## మీ రక్షణ మా బాధ్యత

- ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటాం
- ఎస్పీ అఖిల్ మహాజన్



ఎస్పీకి రాఖీలు కడుతున్న విద్యార్థినిలు

తంగళ్ళపల్లి, ఆగస్టు 19: ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటాం.. మీ రక్షణ మా బాధ్యత అని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. రక్షా బంధన్ సందర్భంగా సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థినిలచే రాఖీ కట్టించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఖీ పండుగ సందర్భంగా ఇంటికి పోలేదని బాధపడవద్దని, నేను పోలీస్ అధికారి స్థాయిలో రాలేదని మీ అందరికీ ఒక అన్నగా మీ దగ్గరకు వచ్చానని అన్నారు. మాది ఉమ్మడి కుటుంబం అని నాకు తొమ్మిది మంది అక్కాచెల్లెళ్లు ఉన్నారన్నారు. ప్రస్తుతం నా అక్కచెల్లెళ్ల స్థానంలో మీరు అందరూ నాకు రాఖీ కట్టాలని నేను మీకు రక్షగా ఉంటానని అన్నారు. జిల్లాలో మహిళల రక్షణకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఆపరేషన్ జ్వాలా కార్యక్రమంతో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ఇస్తున్నామన్నారు. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకుండా బాగా చదువుకోవాలని ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడి అమ్మానాన్నలకు, మనకు చదువు నేర్పిన ఉపాధ్యాయులకి మంచి పేరు తీసుకరావాలన్నారు. విద్యార్థినిలు, మహిళలు ముందుకు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. మహిళలు, విద్యార్థినిలు 100 నెంబరును లేదా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425కు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిఐ మొగిలి, ఎస్ఐ సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఉన్నారు.

## పొంచిఉన్న ప్రమాదం

- శిథిలావస్థ భవనంపై సెల్‌టవర్



రక్షణగోడలు కూలిన భవనం

సిరిసిల్ల టౌన్ ఆగస్టు 19 : సిరిసిల్ల పట్టణంలోని ఓ భవనంపైన ఏర్పాటు చేసిన సెల్‌టవర్ ప్రమాదటపు అంచుల్లో ఉందని స్థానిక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. సిరిసిల్ల పట్టణం గోపాల్ నగర్‌లో మోర్ సూపర్ మార్కెట్ వెనక మూడు అంతస్తుల భవనంపైన ఓ సెల్‌టవర్ ఏర్పాటు చేశారు. ఈ భవనంపై ఉన్న రక్షణగోడలు కూలిపోయాయి. భవనం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళనలో ఉన్నారు. ఒకేసారి మూడు అంతస్తులకు సంబంధించి రక్షణ గోడలు కూలిపోవడంతో జనం భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే ఈ ప్రాంతాన్ని సందర్శించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## భక్త జనసంద్రంగా రాజన్న క్షేత్రం



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 19: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. శ్రావణ మాసం మూడవ సోమవారం సందర్భంగా ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. మహారాష్ట్రతో పాటుగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో రాజన్న ఆలయం భక్తులతో కిటకిటలాడిది. ఉదయం ఆలయ కల్యాణకట్టలో భక్తులు తలనీలాలు తీసుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌లో భక్తులు ఆలయంలోకి వెళ్లి పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి సుమారుగా 30 వేల మంది భక్తుల వరకు వచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందుల తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఏఈవోలు శ్రీనివాస్, రమేష్‌బాబు, సూపరిండెంట్ రాజన్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివసాయిలు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో రుగ్వేద, యజుర్వేద ఉపాకర్మ కార్యక్రమాన్ని సోమవారం అర్చకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పాల్గొన్నారు.

### రాజన్నను దర్శించుకున్న కలెక్టర్

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం దర్శంచుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు ఆలయాధికారులు స్వాగతం పలికారు. ఆలయంలో శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఆలయ అర్చకుడు రాజన్న ఆశీర్వచనం గావించగా ఆలయ ప్రొటోకాల్ పీఆర్వో రాజన్‌బాబు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



స్వామివారి సన్నిధిలో కలెక్టర్

### ఘనంగా మహాలింగార్చన

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం మహాలింగార్చన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం మూడవ సోమవారం పురష్కరించుకుని ఉదయం 5.30 గంటలకు ఆలయంలో శ్రీస్వామి వారి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం సాయంత్రం 6.05 గంటలకు బ్రహ్మణుల మంత్రోచ్చరణల మధ్య మహాలింగార్చన నిర్వహించారు.




రాజన్న ఆలయంలో మహాలింగార్చన

## నలుగురు డీజే నిర్వాహకులపై కేసు

తంగళ్లపల్లి, ఆగస్టు 19: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల, తంగళ్లపల్లి గ్రామాల్లో అనుమతి లేకుండా డీజేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. ఆదివారం రాత్రి జిల్లెల్లలో మూడు డీజేలు, మండల కేంద్రంలోని బాబాజీ కాలనీలో ఒక డిజే సీజ్ చేసి నలుగురు నిర్వాహకులు పోలాడి నవీన్, కోడం పృథ్వి, పంది సాయికుమార్, కోడం ప్రశాంత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనుమతి లేకుండా డీజే నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ దాడులలో ఏఎస్‌ఐ చంద్రమౌళి, కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి**



## ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

### శివాలయాల్లో భక్తుల పూజలు



హైకోర్టు జడ్జికి స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్ కిరణ్

ధర్మపురి, ఆగస్టు 19: ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ నెల కొంది. శ్రావణ మాసంలో మూడవ సోమవారం శివాలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి స్వామి వారలను దర్శించుకున్నారు. వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు, నిర్వహించారు. సాయంత్రం రామలింగేశ్వర స్వామి వారిని నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు సేవ నిర్వహించారు. పాలెపు ప్రవీణ్‌శర్మ, బూన ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, విశ్వనాథశర్మ, సాయికుమార్ పాల్గొన్నారు.

**హైకోర్టు జడ్జి పూజలు**

ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కె. శరత్ దంపతులు సోమవారం సాయంత్రం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఘనంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు వారిని ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్‌జడ్జి దంపతులకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహుకరించి సత్కరించారు. ఆయన వెంట ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్ ఉన్నారు.

## కోటిలింగాలలో భక్తుల సందడి

వెల్గటూర్, ఆగస్టు 19: శ్రావణ మాసం సందర్భంగా మండలం లోని కోటిలింగాల కోటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొన్నది. శ్రావణ మాసం మూడవ సోమవారం సందర్భంగా భక్తులు కుటుంబ సమేతంగా గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు నాగ రాజు శర్మ, సంజీవ్‌శర్మలు స్వామి వారికి అర్చన, అభిషేకాలు, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. వెల్గటూర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

## సోమేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

మల్లాపూర్, ఆగస్టు 19 : మండల కేంద్రంలోని అతిపురాతనమైన పేరుగాంచిన సోమేశ్వర కొండపైన ఆలయంలోని స్వామి దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ పౌర్ణమి సోమవారం సందర్భంగా ఆలయంలోని శివలింగాన్ని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులతో సందండి నెలకొంది. ఉదయం నుంచి భక్తులు స్వామి వారికి రుద్రాభిషేకం చేసి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారికి బెల్లంతో తయారు చేసిన వరద పాయసాన్ని సమర్పించినంతరం స్వామి తీర్థ ప్రసాదాలను భక్తులు స్వీకరించారు. నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు.

## 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం

ముత్తారం, ఆగస్టు 19: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ మండల కేంద్రంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ... ముత్తారం మండల కేంద్రంలో గంట భీమయ్య అనే వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంట భీమయ్యపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని తెలిపారు.

## ఊరచెరువులో గుర్తు తెలియని మృతదేహం



కథలాపూర్, ఆగస్టు 19 : మండలంలోని ఊర చెరువులో సోమవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్సై నవీన్ తెలిపారు. చెరు వులో శవం తేలి కనిపించగా స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 50 ఏళ్ల లోపు వయస్సున్న వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. వ్యక్తి వివరాలు తెలిసిన వారు తమకు అందజేయాలని ఎస్సై కోరారు.

## పెద్దపల్లిలోని హనుమాన్‌నగర్‌లో..



**పెద్దపల్లిటౌన్:** పట్టణంలోని హనుమాన్ నగర్‌లో సోమవారం ఓ వ్యక్తి గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు పోలీసులు తెలిపారు, అతిగా మద్యం సేవించి డీహైడ్రేషన్‌కు గురై చని పోయినట్టు, మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో ఉంచినట్లు తెలిపారు. మృతుడు చామనచాయ రంగులో ఉండి 5.6 ఫీట్ల పొడువు కలిగి జీన్ ప్యాంటు ధరించి ఉన్నట్టు, కుడి చెయ్యిపై మరాఠీ భాషలో పచ్చబొట్లు రాసి ఉన్నట్లు వివరించారు. గుర్తించిన వారు పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లోగాని, 8712 656506, 8712656507లో సంప్రదించాలని సూచించారు.

## 'ఎల్లంపల్లి' నుంచి తగ్గిన నీటి విడుదల

పెద్దపల్లి/బోయినపల్లి/ ఇల్లంతకుంట, ఆగస్టు 19: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. సోమవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,602 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.627 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. సోమవారం ఉదయం 6,731 క్యూసెక్కుల వరద నీరు రాగా, మధ్యాహ్నం వరకు తగ్గుముఖం పట్టడంతో రెండు మోటార్లలో ఒకదానిని నిలిపివేసి ఒక మోటార్‌తోనే నీటిని ఎత్తిపోస్తున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకిం ఇన్‌ఫ్లో పెరిగింది. ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్‌హౌస్ ద్వారా 3,150 మానేరు, మూలవాగు ద్వారా 840 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు 16.11 టీఎంసీలకు చేరింది. ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో 2.12 టీఎంసీల నీరు చేరింది. మధ్యమానేరు ద్వారా సర్జిపూల్‌కు వచ్చిన 3,200 కూసెక్కుల నీటిని ఒక పంప్ ద్వారా రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఎగువన ఉన్న సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌కు 3,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

### కాకతీయ కాలువకు పెరిగిన నీటి విడుదల

**జగిత్యాల:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. ఎస్సారెస్పీలోకి 11,470 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 49.435 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 4,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

## జాడలేని రోడ్డు భద్రతా చర్యలు



● జూలై 12న తెల్లవారుజామున 4 గంటలకు కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బొమ్మకల్ కృష్ణనగర్ కాలనీకి చెందిన పాలాడి సాయికుమార్(26) దుర్మరణం చెందాడు. అతని స్నేహితుడు కత్తెర్ల అరవింద్‌కు తీవ్రగాయాలయ్యాయి. సాయికుమార్, అరవింద్ బైక్‌పై అల్గునూర్ నుంచి కరీంనగర్‌కు వస్తుండగా కోతిరాంపూర్ వద్ద రోడ్డు పక్కన పార్క్ చేసిన వ్యాన్‌ను వెనుకవైపు ఢీకొన్నారు. దీంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అరవింద్‌ను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వ్యాన్ పార్కింగ్ లైట్లు వేసుకోకుండా నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా రోడ్డు పక్కన పార్క్ చేయడంతో చీకట్లో వ్యాన్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొట్టిందని మృతుడి తండ్రి మహేందర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

● జూలై 25న అర్ధరాత్రి కరీంనగర్‌కు చెందిన వ్యాపారి తాటికొండ రమేష్(49) చొప్పదండి నుంచి కరీంనగర్‌కు తన కారులో వస్తుండగా కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ వద్ద రోడ్డుపై పార్క్ చేసిన లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రమేష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

- పార్క్‌చేసిన వాహనాలను ఢీకొని రెండువారాల్లో ఇద్దరి దుర్మరణం
- రోడ్లపైనే వాహనాల పార్కింగ్....
- పార్కింగ్‌లైట్స్ వేయకుండా డ్రైవర్ల నిర్లక్ష్యం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19: రోడ్లపైనే యథేచ్ఛగా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రాత్రి వేళ వెనుకవైపు నుంచి వచ్చే వాహనాలు ఢీకొని తరచుగా ప్రమాదలు జరుగుతున్నాయి. కరీంనగర్, శివార్ల లో ఇటీవల జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ రెండు ప్రమాదాలు రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాలను రాత్రివేళ వెనుకవైపు నుంచి వాహనదారులు ఢీకొట్టడంతో జరిగాయి. మూడేళ్ల క్రితం అల్గునూర్ పెట్రోల్‌బంక్ వద్ద రోడ్డు పక్కన నిలిపిన లారీని కారు వేగంగా ఢీకొట్టడంతో నలుగురు మృత్యువాత పడ్డారు. ఇటువంటి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు నిర్దిష్టమైన రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవటంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

**● నిబంధనలను పట్టించుకోకపోవడంతో..**

రాత్రి సమయాల్లో రోడ్లపై, రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాలకు పార్కింగ్ లైట్లు వేసి ఉంచాలి. ఈ నిబంధనను డ్రైవర్లు పట్టించుకోక పోవడంతో రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారులపై దూర ప్రాంతాలకు ప్రయాణించే భారీ వాహనాల డ్రైవర్లకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అటువంటి సౌకర్యాలు ఏవీ లేకపోవ డంతో రోడ్డు పక్కన భారీ వాహనాలు నిలిపిన డ్రైవర్లు అందులోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. రాత్రి సమయంలో వెనుకవైపు నుంచి వచ్చిన వాహనాలు ఢీకొట్టడంతో ప్రమాదాలు జరుగతున్నాయి. రహదారులకు సర్వీసు రోడ్లు లేక పోవటం, మద్యం మత్తులో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించకుండా ఓవర్‌టేక్ చేయడం వల్లనే ప్రమాదాలు పెరిగిపోతున్నాయి.




## చిల్లర మరిచిపోయారా.. టెన్షన్ పడకండి

**టికెట్ వెనుక సెల్ నంబర్‌రాసి ఇస్తున్న కండక్టర్**



భగత్‌నగర్, ఆగస్టు 19: టికెట్‌కు సరిపడా చిల్లర తీసుకుని రావాలి... దిగేటప్పుడు చిల్లర తీసుకోండి అంటూ సర్ది చెప్పే కండక్టర్లు ఉన్న ఈ రోజుల్లో టికెట్‌కు సరిపడా చిల్లర లేక పోతే టికెట్ వెనుక డ్యూతో పాటు సంతకం చేసి తన సెల్ నంబర్ రాసి ఇస్తున్నాడో కండక్టర్. కరీంనగర్-2 డిపోలో పనిచేసే వీఎల్ నారాయణ అనే కండక్టర్ బస్సుల్లో రద్దీకి అనుగుణంగా టికెట్లు ఇచ్చి టికెట్‌కు సరిపడా చిల్లర లేక పోతే టికెట్ వెనక ఆ మొత్తంతోపాటు తన సెల్ నంబర్ రాసి సంతకం చేసి ఇస్తున్నాడు. ఎవరైనా ప్రయాణికులు ఆదరా బాదరాగా బస్సు దిగి వెళ్లి పోతే వారు టికెట్ వెనుకాల ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి టికెట్‌ను వాట్సాప్‌లో పంపిస్తే ఆయన డబ్బులను ఫోన్ పే ద్వారా పంపిస్తున్నాడు. వీఎల్ నారాయణను ప్రయాణికులతో పాటు, ఆర్టీసీ ఉద్యోగులు ప్రశంసిస్తున్నారు.



టికెట్ వెనుక డ్యూతోపాటు, సంతకం, సెల్ నంబర్‌రాసి ఇచ్చిన కండక్టర్



నీటితో నిండిన రైతు వేదిక ప్రాంగణం

## కుంట కాదు.. రైతువేదిక ప్రాంగణం

- నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు
- ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని కోరుతున్న రైతులు

కొడిమ్యాల, ఆగస్టు 19 : మండలంలోని పూడూర్ గ్రామ శివారులో నిర్మించిన రైతువేదిక ప్రాంగణం రెండు రోజులుగా కురిసిన వర్షపు నీరు, సమీప పొలాల నుంచి వస్తున్న నీటితో కుంటను తలపిస్తోంది. రైతు వేదిక భవనాన్ని క్లస్టర్ పరిధిలోని రైతులకు సమావేశాలను నిర్వహించుకోవటానికి, రైతులకు శిక్షణ ఇవ్వటానికి, ఒకేసారి సుమారు 250 మంది సమావేశం కావటానికి అనుగునంగా గత ప్రభుత్వం సుమారు 22 లక్షల రూపాయలతో నిర్మించింది. ఈ భవనాన్ని 2021లో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ ప్రారంభించారు. పూడూర్ క్లస్టర్ భవనం ముందు ఎక్కువగా మొరం పోస్తే నీరు నిలిచి ఉండేది కాదని పలువురు రైతులు తెలిపారు. నిర్మాణ సమయంలో రెండు మరుగుదొడ్లను నిర్మించారు. ప్రస్తుత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న రైతు నేస్తం వీసీ కార్యక్రమం పూడూర్ క్లస్టర్‌లోనే నిర్వహిస్తున్నారు.

రైతు నేస్తం కార్యక్రమానికి వచ్చే రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బందికి సహాయ పడే అటెండర్‌ను కూడా నియ మించక పోవటంతో భవనం లోపల అపరిశుభ్రంగా ఉంటోంది. నిర్వహణ ఖర్చులు పెరిగి పోవడం చేసిన ఖర్చులకు నిధులు రాకపోవడంతో ఎవ్వరు ముందుకు రావటం లేదని రైతులు తెలిపారు. సమావేశాలకు వచ్చే రైతులకు సౌకర్యంగా ఉండటానికి అదనంగా మరుగుదొడ్లు నిర్మించాల్సిన అవసరం ఉంది. భవనం చుట్టు ప్రహరీ లేని కారణంగా కోతుల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్థులు తెలిపారు. వర్షం కురిసిన ప్రతిసారి భవన ప్రాంగణం బురదమయంగా మారుతుందని రైతులు తెలిపారు. బురద నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులను, సంబంధిత అధికారులను రైతులు కోరుతున్నారు.

**నిధులు మంజూరు చేయాలి బండ లింగారెడ్డి మాజీ ఉప సర్పంచు పూడూర్**



పూడూర్ రైతు వేదిక భవనం ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. భవనం ఎదుట అవసరం ఉన్నం మొరం పోయించి బురద కాకుండా చర్యలు తీసుకోవాలి. అదనంగా మరుగు దొడ్ల నిర్మాణం చేపట్టాలి.

**నిర్వహణ ఖర్చులు అందించాలి : ఏవో జ్యోతి**



రైతు వేదిక భవన నిర్వహణ ఖర్చులు అందించాలి. కోతుల బెడద ఎక్కువగా ఉన్నందున ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రైతు వేదిక భవనానికి అటెండర్‌ను నియమించాలి.



నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

## గంజాయి విక్రేత అరెస్టు

**368 గ్రాముల గంజాయి, సెల్ ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం**

కోరుట్ల, ఆగస్టు 19 : ఉన్నత చదువులు చదివి కన్న వారి కలలను నిజం చేయాల్సిన ఓ బీటెక్ యువకుడు జల్సాలకు అలవాటు పడి చివరికి కటకటాలపాలయ్యాడు. చదువు కోసం ఇంటి నుంచి అమ్మ పంపే డబ్బులను జల్సాలకు వాడి అడ్డదారికి అలవాటు పడి పోలీసులకు చిక్కాడు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థిని కోరుట్ల పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద 368 గ్రాముల గంజాయి, సెల్ ఫోన్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. సోమవారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కోరుట్ల రెండో ఎస్ఐ శ్వేతతో కలిసి సీఐ సురేష్ బాబు వివరాలను వెల్లడించారు. రాయికల్ మండల కేంద్రానికి చెందిన పెనుకొండ గణేష్ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. చదువు కోసం తల్లి ఇచ్చే డబ్బులను జల్సాలకు వాడటంతో అవి సరిపోలేదు. దీంతో ఇంకా సంపాదించాలన్న దురాలోచనతో తక్కువ ధరకు గంజాయిని కొని కోరుట్ల పట్టణంతో పాటు పరిసర గ్రామాలలోని గంజాయి అలవాటున్న యువకులకు విక్రయించేవాడు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర రావుల పర్య వేక్షణలో ఎస్ఐ శ్వేత తన సిబ్బందితో పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీ నిర్వహించారు. పైడి మడుగు గ్రామ శివారులోని ఎల్లమ్మ దేవాలయ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో గణేష్ వాహనాన్ని తనిఖీ చేయగా వాహనంలోని బ్యాగ్‌లో 368 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించి పోలీ సులు అతడిని కోరుట్ల పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేశారు. రా యికల్ మండల కేంద్రానికి చెందిన యువకుడిగా గుర్తించారు. విచారణలో గ ణేష్ పూర్తి వివరాలు వెల్లడించాడు. గణేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేష్ బాబు తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ శ్వేత, కానిస్టేబుల్స్ పవన్ కుమార్, శ్రీనివాస్, సాగర్‌లను సీఐ అభినందించారు.





వివరాలను వెల్లడిస్తున్న సీఐ సురేష్ బాబు

## బెల్లంపల్లి చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- వ్యాపారి కారు డ్రైవరే సూత్రధారి
- నలుగురి అరెస్టు
- రూ.24లక్షలు స్వాధీనం



నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఆగస్టు 19: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి కారు నుంచి రూ.28లక్షలు చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. వ్యాపారి వద్ద గతంలో డ్రైవర్‌గా పని చేసిన పటాలవత్ దాస్ అనే వ్యక్తే ఈ చోరీకి పథకం వేసినట్టు పోలీసులు గుర్తించారు. అతని తో పాటు జోగు అలియాస్ పోతుల శివ, ముప్పురు రాజు, పండుగ రాజును సోమ వారం బెల్లంపల్లిలో అరెస్టు చేసినట్టు రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి రూ.24 లక్షల నగదు, రెండుబైక్‌లు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నా మన్నారు.

సోమవారం పెద్దపల్లి జిల్లా రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ అరెస్టు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన బిపిన్ కుమార్ అనే వ్యాపారి వివిధ జిల్లాలకు సరుకులు ఇచ్చి ప్రతీ నెలా కలెక్షన్‌కు వచ్చేవాడు. పెద్దఎత్తున నగదును తీసుకెళ్లేవాడు. అతని వద్ద హైదరాబాద్ అత్తాపూర్‌కు చెందిన పటాలవత్ దాస్ (26) డ్రైవర్‌గా పని చేసే వాడు. డ్రైవర్‌గా పని చేసే సమయంలోనే కారుకు డూప్లికేట్ కీ తయారు చేయించుకున్నాడు. తరువాత పని మానేశాడు. బిపిన్ కుమార్ కలెక్షన్‌కు వెళ్లిన సమయంలో అతని కారు నుంచి నగదు చోరీ చేసేందుకు ప్రణాళిక వేసుకున్నాడు. స్నేహితులైన జోగు అలియాస్ పోటుల శివ(25), ముప్పురు రాజు (25), పండుగ రాజు(22)ను కలుపుకొని చోరీకి పథకం వేసుకున్నారు.

ఈ నెల 16న బిపిన్ కుమార్ హైదరాబాద్ నుంచి కలెక్షన్‌కు మంచిర్యాలకు వెళుతున్నాడని తెలిసి రెండు బైక్‌ల్లో అతడిని అనుసరించారు. మంచిర్యాలలో బిపిన్‌కుమార్ బస చేసిన లాడ్జ్ సమీపంలోని గుళ్లో నిందితులు బస చేశారు. తెల్లవారి నలుగురు రెండు బైక్‌లపై వేరువేరుగా డబ్బులున్న కారును వెంబడించారు. 17న బెల్లంపల్లి బజార్ మెయిన్ రోడ్డులోని సత్తన్న ఇడ్లి బండి వద్ద నిలిపి ఉన్న కారును నకిలీ కీ ద్వారా డోర్ తెరిచి మాజీ డ్రైవర్ దాసు, అతని స్నేహితుడు శివ రూ.28 లక్షలు ఎత్తుకెళ్లారు. తరువాత బెల్లంపల్లి సమీపంలోని అడవిలో తల దాచుకున్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పర్యవేక్షణలో బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య నాలుగు టీములను ఏర్పాటు చేశారు.

ఈ టీములు సీసీ పుటేజీలను పరిశీలించగా బైక్‌లపై వచ్చిన వ్యక్తులు నగదు గల బ్యాగును ఎత్తుకెళ్లినట్టు గురించారు. సోమవారం నిందితులు టిఫిన్ చేయడానికి బెల్లంపల్లికి వస్తుండగా ప్రభుత్వ కళాశాల వద్ద తనిఖీల్లో నిందితులు పట్టుబడ్డారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ దేవయ్య, కానిస్టేబుల్ మల్లేషం, మంచిర్యాల సీసీఎస్ కానిస్టేబుళ్ల సతీష్, శ్రీనివాస్‌లకు సీపీ శ్రీనివాస్ రివార్డులు అందజేశారు.

## కొండగట్టులో అధ్వానంగా వాహనపూజల షెడ్డు

- వర్షం వస్తే.. పూజలు నిలిచిపోవడమే!
- ఊడిన రేకులు.. వర్షంలోనే భక్తులు
- ముందుకువెళ్లని నూతన షెడ్డు ప్రతిపాదనలు



ఊడిన రేకుల షెడ్డు కింద వర్షంలో భక్తులు

మల్యాల, ఆగస్టు 19: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో వాహన పూజలు నిర్వహించే షెడ్డు అస్తవ్యస్తంగా మారింది. షెడ్డు రేకులు ఊడి పూజలకు ఇబ్బందిగా మారుతోంది. కొండగట్టు అంజన్న సన్నిధిలో తమ వాహనాలకు పూజలు చేసుకుంటే ఎంతో శుభప్రదమని భక్తులు కొండంత ఆశలతో పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే నిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సు, లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, ఎక్స్‌కావేటర్లు, జేసీబీ తదితర వాహనాలకు పూజలు జరుగుతుంటాయి. అయితే ఆలయానికి కొంత దూరంలో గల వాహన పూజల షెడ్డు ఏళ్లగా మరమ్మతులకు గురి కాగ పట్టించుకోవడం లేదు. రేకులు ఊడి ఉండడం, కోతుల చేష్టలతో అటు భక్తులకు అర్చకులకు అసౌకర్యంగా మారింది. పూజల సమయంలో వర్షం వస్తే వాహనాలు, భక్తులు, అర్చకులు పూర్తిగా తడిచిపోవాల్సిందే. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో వాహన పూజలకు ఆటంకం కలుగుతుండగా వర్షం కురుస్తున్నప్పుడు పూజలు మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంది. పైగా ఆయా వాహనాలతో వచ్చిన భక్తులు వర్షంలోనే నిలుచోవల్సిన పరిస్థితి ఏర్పడింది. షెడ్డు ఇరుకుగా ఉండడంతో పాటు ఎండకు, వానకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. వాహన పూజల ద్వారా దేవస్థానానికి ఏటా లక్షలాది రూపాయల ఆదాయం సమకూరుతుండగా కనీసం షెడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంపై భక్తులు మండి పడుతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని వాహనాలకు అనుగుణంగా పెద్ద నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. వై జంక్షన్ ప్రాంతంలో వాహన పూజలు నిర్వహించేందుకు రూ.15లక్షలతో రుపొందించిన ప్రతిపాదనలు ముందుకు వెళ్లడం లేదు. దేవస్థానం అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## శిథిలావస్థలో అబ్బాపూర్ ప్రభుత్వ పాఠశాల



ప్రభుత్వ పాఠశాల

**భయాందోళనతో ప్రైవేట్ బడులకు పంపిస్తున్న తల్లిదండ్రులు**

**చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు**

గొల్లపల్లి, ఆగస్టు 19: ప్రభుత్వాలు మారినా తమ ఊరి పాఠశాల దుస్థితి మారడం లేదని గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామస్థులు వాపోతున్నారు. సుమారు యాభై ఏళ్ల కిందట నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారింది. అందులో చదువుకోడానికి విద్యార్థులు, పంపించడానికి తల్లిదండ్రులు, విద్యా బోధన చేయడానికి ఉపాధ్యాయులు జంకుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిచిన విద్య సంవత్సరం వరకు కాలం వెళ్లదీశారు. ఇక ప్రాణాలతో చెలగాటమాడదల్చు కోలేదంటూ ఆర్థిక భారం మీద పడుతున్నప్పటికీ ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. పాఠశాల భవనం పూర్తిగా నాచు పట్టి, గోడలు, పైకప్పుల పెచ్చులూడి, కిటికీలు పాక్షికంగా ధ్వంసమై బూత్ బంగళాను తలపిస్తోంది. వర్షం పడినప్పుడల్లా పైనుంచి లోపలికి ధారాళంగా కురుస్తున్న వర్షపు నీటితో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుంది. ఒక్కోసారి ఇక్కడ వర్షం పడినప్పుడల్లా పాఠశాలకు సెలవే. ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యం, సంబంధిత ఉన్నతాధికారుల ఉదాసీనతా వెరసి విద్యార్థుల తల్లిదండ్రులకు శాపంగా మారింది. దీంతో కొన్నేళ్లుగా పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికి పట్టించుకున్న నాథులు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మొదటి దఫా పార్టీ సర్పంచ్ ఉన్నప్పటికి నూతన భవనం నిర్మాణానికి నిధుల మంజూరుకు నోచుకోలేదు. గత సంవత్సం వరకు ఎలా గోలా నెట్టుకొచ్చిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ విద్యా సంవత్సరంలో భయాందోళనతో పాఠశాలకు తమ పిల్లలను పంపించడానికి నిరాకరించి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో సంబంధిత విద్యా శాఖ అధికారులు విద్యార్థుల 0 సంఖ్య నెపంతో పాఠశాలను మూసివేసి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా పాఠశాలకు నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భరోసా :**

ఇటీవల గ్రామంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పర్యటించిన సందర్భంలో తాజామాజీ సర్పంచ్ పురంశెట్టి పద్మవెంకటేశం తమ గ్రామంలో పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. స్పందించిన ప్రభుత్వ విప్ అతి త్వరలో పాఠశాల నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని, ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విప్ హామీతో తమ పాఠశాల పునఃప్రారంభమవుతుందని గ్రామస్థులు కొండంత ఆశతో ఎదిరిచూస్తున్నారు.

**భవనం నిర్మించాలి: పురంశెట్టి పద్మ, తాజామాజీ సర్పంచ్,**



గ్రామంలో నిరుపేద తల్లిదండ్రులు తమ పిల్లలను ఎన్నో కష్టనష్టాలకోర్చి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఊరిలో బడి ఉన్నప్పటికి అది పూర్తిగా కూలిపోయే దశలో ఉంది. దీంతో తల్లిదండ్రులు భయపడి తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపిస్తున్నారు. నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంతో కాలంగా ఉన్నతాధికారులకు, అప్పటి ప్రభుత్వ పెద్దలకు పలుమార్లు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకోలేదు.

**విద్యార్థుల లేక పాఠశాలను మూసివేశాం: జమునా దేవి, ఎంఈవో**

గత సంవత్సరం వరకు విద్యార్థులు పాఠశాలలో విద్యనభ్యసిం చారు. ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులు ఎవరూ పాఠశాలకు రాకపోవడంతో పాఠశాలను మూసివేయించి ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పై ఇతర పాఠశాలలకు పంపించాం. పాఠశాల భవనం ప్రమాద భరి తంగా మారడంతో తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను పంపించడానికి జంకు తున్నారు. దీని పై సంబంధిత ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం.

### పాము కాటుతో యువకుడి మృతి

పాలకుర్తి, ఆగస్టు 19: పాలకుర్తి మండల కేంద్రంలో పాముకాటుతో శాతరాజుల సతీష్(39) ఆదివారం రాత్రి మృతి చెందాడు. బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. శాతరాజుల సతీష్(39) టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి సతీష్ తన ఇంటి దగ్గరలోని కిరాణాషాప్‌నకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆయనను పాము కాటువేసింది. గమనించిన చుట్టుపక్కల వారు పామును చంపి, యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు సతీష్ భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

### విద్యుదాఘాతంతో మహిళ మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19: కరీంనగర్‌లోని ఖాన్‌పురకు చెందిన నిఖిత్ తస్లీం(35) విద్యుదాఘాతంలో మృతి చెందిందని కరీంనగర్ మూడో టాణా పోలీసులు తెలిపారు. సోమవారం తన ఇంటిలోని వాషింగ్ మిషన్‌లో బట్టలు వేసి స్విచాన్ చేయగా విద్యుదాఘాతంతో నిఖిత్ తస్లీం కిందపడిపోయిందని తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ఆమెను ఆసుపత్రికి తరలించగా వైద్యుల పరీక్షించి మరణించినట్లు వెల్లడించారన్నారు. మృతురాలికి భర్త, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ముసుగు తొలగేనా?



కనగర్తిలోని విగ్రహం

కోనరావుపేట, ఆగస్టు 19: మన్యం వీరుడు, స్వాతంత్ర్య విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ముసుగు తొలగడం లేదు. కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద మన్యం వీరుడు స్వాతం త్ర్యయోధుడి విగ్రహాన్ని 14 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కానీ సంవత్సరాలు గడుస్తున్నా విగ్రహానికి ముసుగు తొలగక పోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విగ్రహం ముసుగు తొలగించాలని ప్రజలు కోరారు.

## రక్షాబంధన్ వేళ ఎదురు చూపులు

● గురుకులం వద్ద తల్లిదండ్రుల ఆవేదన



బద్దెనపల్లి గురుకుల పాఠశాల గేటు వద్ద తల్లిదండ్రులు, సోదరులు

సిరిసిల్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సోదరసోదరీమణుల అనుబంధానికి, ఆప్యాయతకు వారధిగా నిలిచే రాఖీ పండుగ రోజు విద్యార్థుల తల్లిదండ్రులు, సోదరసోదరీమణులకు ఎదురు చూపులే మిగిలాయి. రక్షా బంధన్ వేళ పాఠశాలలకు సెలవు ఇచ్చినా గురుకుల పాఠశాలలకు సెలవు లేకపోవడంతో తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థినిల తల్లిదండ్రులు తమ కుమారులను తీసుకుని రాఖీ కట్టించుకునేందుకు గురుకుల పాఠశాలకు వచ్చారు. అక్కాచెల్లెళ్లతో రాఖీ కట్టించుకోవడానికి ఎంతో ఆశతో వచ్చిన సోదరులకు వారి తల్లిదండ్రులను పాఠశాల లోపలికి అనుమతించలేదు. ఉదయం నుంచి వారు పాఠశాల వద్దనే వేచి ఉన్నారు. తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేసినా పట్టించుకునేవారు లేరు. గేటు వద్ద పడిగాపులు పడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వెల్లువెత్తడం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలంటూ పోస్టులు పెట్టడంతో చివరకు మధ్యాహ్నం వారిని అనుమతించారు.

## ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



చందుర్తిలో కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రఫీ అసోసియేషన్ సభ్యులు

చందుర్తి ఆగస్టు 19: చందుర్తి మండల కేంద్రంలో మండల ఛాయాచిత్ర ఫోటో, వీడియోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 185వ ప్రపంచ ఫొటోగ్రఫీ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ మండల అసోసియేషన్ అధ్యక్షులు రాపెల్లి గంగాధర్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపించేశారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాటికొండ నరేష్, సభ్యులు ఉదయ్ కుమార్,తొటు సురేష్, అసినిపర్తి కుమార్, తాళ్ళపల్లి మహిపాల్, నాయకులు గొట్టే ప్రభాకర్,పులి సత్యం, బత్తుల కమలాకర్, మోతే రాములు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్: ఫొటోగ్రఫీ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో రూరల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మెన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సందెల నరేష్, సభ్యులు గోవర్ధన్, అంజి, సుధాకర్, వేణు, నాగరాజు, విజయ్, శ్రీకాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఫోటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండు ప్రాంతంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్ర పటానికి పూలమాలలు వేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అజీమొద్దిన్, కుబేరస్వామి, ఫక్రుద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, షాదుల్, నర్సింలు, శంకర్, కృష్ణహరి, ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## విడదీయలేని బంధం

● శునకానికి రాఖీకట్టిన మహిళ

● మొక్కలను రక్షించాలంటూ రాఖీ కట్టిన యువతి



రాచర్లగొల్లపల్లిలో శునకానికి రాఖీ కట్టిన మాధవి



సుద్దాలలో మొక్కలకు రాఖీ కడుతున్న బ్లెస్సీ

ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట, ఆగస్టు 19: జిల్లాకు చెందిన ఒకరు శునకానికి, మరొకరు మొక్కలకు రాఖీలు కట్టి జంతువుల పట్ల, మొక్కల పట్ల ప్రేమను చాటుకుంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన బుగ్గ మాధవి ఎల్లప్పుడూ తన వెన్నంటి ఉండే తాను పెంచుకుంటున్న శునకం పట్ల ప్రేమభావం చాటుకున్నారు. సోమవారం రాఖీ పండుగ సందర్భంగా బొట్టుపెట్టి రాఖీ కట్టారు. కోనరావుటపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ప్రకృతి ప్రేమికురాలు బ్లెస్సీ మొక్కలకు రాఖీలు కట్టి వాటిని రక్షించాలంటూ అనుబంధాన్ని చాటుకుంది. బ్లెస్సీ తన తండ్రి ప్రకృతి ప్రేమికుడు దొబ్బల ప్రకాష్ సహాయంతో ప్రతి సంవత్సరం విత్తన బంతులు తయారు చేసి అటవీ ప్రాంతంలో చల్లుతుంది. మొక్కలకు రాఖీ కట్టి ప్రర్యావరణహితాన్ని చాటింది.

## పగిలిన ఆర్టీసీ బస్సు టైర్.. తప్పిన ప్రమాదం



నిలిచిపోయిన బస్సు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 1: ప్రయాణికులతో ఎల్లారెడ్డిపేట వైపు నుంచి కామారెడ్డికి వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనుక టైర్ మండలంలోని రాచర్లగొల్లపల్లి గ్రామ శివారులో సోమవారం పగిలిపోయింది. డ్రైవర్ అప్రమత్తం కావడంతో వల్ల ప్రమాదం తృటిలో తప్పినట్లయింది. సుమారు 50 మందితో సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎల్లారెడ్డిపేట మీదుగా కామారెడ్డికి వెళుతోంది. రాచర్ల గొల్లపల్లి గ్రామ శివారులో ఒక్కసారిగా భారీ శబ్దంతో వెనుక టైర్ పగిలిపోయింది. దాంతో అందులోని ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. అప్రమత్తమైన బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పినట్లయింది.

# జిల్లాలో ఘనంగా రాఖీ వేడుకలు



రాఖీ కడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ



వేములవాడలో రాఖీ వేడుకలు



పోలీసులకు రాఖీ కడుతున్న విద్యార్థులు



ముస్తాబాద్ కెజీవీబీలో రక్షాబంధన్



వీర్నపల్లిలో..

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఆత్మీయ అనుబంధాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. సిరిసిల్లలోని శ్రీమార్కండేయ దేవాలయం, శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం, శ్రీ విశ్వనాథ స్వామి దేవాలయం, శ్రీ అయ్యప్ప దేవాలయంతోపాటు వివిధ హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. యజ్ఞోపవీతాలకు ప్రత్యేక పూజలు చేసి మార్చుకున్నారు. శ్రీమార్కండేయ దేవస్థానంలో మార్కండేయ మహా యజ్ఞాన్ని నిర్వహించారు. రాఖీ పండుగతో వివిధ ప్రాంతాల్లో రోడ్లపైన మహిళల సందడి కనిపించింది. రాఖీ బండార్‌లు, స్వీట్ దుకాణాలు, కోలాహలంగా మారాయి.

● వేములవాడ: అన్నాచెల్లెల్ల ప్రేమకు ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలు సోమవారం నాడు వేములవాడలో ఘనంగా జరుపుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళలు తమ సోదరులకు రాఖీ కట్టి ప్రేమను చాటుకున్నారు. మహిళల రాకపోకలతో ఆర్టీసీ బస్సులు రద్దీగా మారాయి.

● ఇల్లంతకుంట: రాఖీపౌర్ణమి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. ఇతర ప్రాంతాలలో ఉన్న ఆడపడుచులు తమ పుట్టింటికి వచ్చి సోదరులకు రాఖీలు కట్టారు. రాఖీలు, స్వీట్ల కొనుగోళ్లతో మండల కేంద్రంలో సందడి నెలకొంది. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో రాఖీపౌర్ణమి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

● ముస్తాబాద్: మండలంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి దుకాణాల వద్ద సోదరీమణులు బారులు తీరారు. రాఖీలు కొని సోదరులకు స్వీట్లు అందిస్తూ రాఖీలు కట్టి అన్న చెల్లెళ్ల బంధాన్ని చాటారు. అలాగే ముస్తాబాద్ ఎస్సై సీహెచ్ గణేశ్ ఆధ్వర్యంలో స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహంలో రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. మీకు రక్షగా మేము ఉన్నామంటూ విద్యార్థినిలచే రాఖీలు కట్టించుకున్నారు. స్థానిక పీసీ ఖాసీం విద్యార్థినిచే రాఖీ కట్టించుకున్నారు. వేడుకలు ఆనందోత్సాహాల మధ్య సాగాయి. మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో అధ్యక్షుడు తడుక బాలకిషన్ ఆధ్వర్యంలో జంధ్యాధారణ వేడుకలను నిర్వహించారు. హోమం, పూర్ణాహుతి, విశేష పూజలు జంధ్యాధారణ నిర్వహించారు. ఈకార్యక్రమంలో గౌడ కృష్ణహ్మి, శ్రీరాం మనోహర్, దొంత బాల్‌రాజు, తాటిపాముల లక్ష్మీనారాయణ, దశరథం పాల్గొన్నారు.

● రుద్రంగి: మండలంలో సోమవారం రాఖీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రాఖీ పండుగ సందర్భంగా ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే నూలు పౌర్ణమి, రాఖీ పౌర్ణమి, జంజ్యాల పూర్ణమి సందర్భంగా పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పద్మశాలీలు జంధ్యోపవేదం ధరించారు.

● గంభీరావుపేట: సోదరాభావానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు గంభీరావుపేట మండలంలో సోమవారం ఘనంగా జరిగాయి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఉదయం ఇంటింటా రక్షా బంధన్ నిర్వహించారు. రాఖీలను అన్నలకు, తమ్ముళ్లకు కట్టారు.

● వీర్నపల్లి: సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతల కు చిహ్నంగా నిలిచే రాఖీ పండుగను వీర్నపల్లి మండలంలో సోమవారం ఆనందోత్సాహాల మధ్య వైభవంగా జరుపుకున్నారు. ప్రతీ ఇంట్లో సోదరిమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి అప్యాయతను చాటారు. యువతులు, మహిళల సందడితో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఎస్ఐ ఎల్లాగౌడ్, పోలీసులకు మాకు మీరు రక్ష. అంటూ యువతులు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించారు.

● ఎల్లారెడ్డిపేట: సోదరాభావానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు ఎల్లారెడ్డిపేట మండలంలో సోమవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో పురోహితుడు ఉమాశంకర్ ఆధ్వర్యంలో పుణ్యావచనం, అభి షేకం, గణపతి పూజ, హోమం జరిపించారు. యజ్ఞోపవీతం గావించారు. స్థానిక వృద్ధుల డేకేర్ సెంటర్‌లోని వృద్ధులకు రాఖీలు కట్టి మిఠాయిలు పంపిణీ చేశారు. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి శోభాయాత్ర నిర్వహించారు.



ప్రతాప రామకృష్ణకు రాఖీ కడుతున్న సోదరి

### ఆది శ్రీనివాస్‌కు రాఖీ కట్టిన మంత్రి సీతక్క

వేములవాడ, ఆగస్టు 19: రాఖీ పౌర్ణమి సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి సీతక్క రాఖీ కట్టారు. సోమవారం ఉదయం హైదరాబాదులో ఆమె ఆది శ్రీనివాస్‌కు రాఖీ కట్టారు. ఇలా ఉండగా ఆది శ్రీనివాస్‌కు సోదరి లీల రాఖీ కట్టారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణకు ఆయన చెల్లెలు రాఖీ కట్టారు.



### తడగొండలో కేంద్ర బృందం సర్వే

బోయినపల్లి, ఆగస్టు 19: దేశంలోని ప్రతి ఇంటికీ కుళాయి నీటి సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ (జేజేఎం) కింద హర్‌ఘర్‌జల్ పథకాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగానే బోయినపల్లి మండలంలోని తడగొండ గ్రామంలో కేంద్ర బృందం ఇంటింటా హర్ ఘర్ జల్ సర్వే నిర్వహించారు.

### వంగిన విద్యుత్ స్తంభం.. ఊత కర్రే ఆధారం



విద్యుత్ స్తంభానికి కర్ర అడ్డుగా పెట్టిన దృశ్యం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 19: ఎల్లారెడ్డిపేట గ్రామంలోని 9వ వార్డులో ఆడెపు రాజుకుమారర్ ఇంటి ఎదుట ఉన్న విద్యుత్ స్తంభం సోమవారం ఒక్కసారిగా వంగిపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కరెంటు స్తంభం ఓ వైపుకు పడిపోయేలా తయారైంది. కాలనీవాసులు ప్రమాదం చోటుచేసుకోకుండా స్తంభానికి ఓ కర్రను ఆధారంగా ఏర్పాటు చేశారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వంగిన విద్యుత్ స్తంభానికి మరమ్మతు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# జిల్లాలో పలుచోట్ల వర్షం



వీర్నపల్లి మండలం మద్దిమల్లలో..



సిరిసిల్ల మార్కెట్‌లో నీరు



వట్టెంలో ఇంటిలోకి చేరిన వర్షపునీరు

సిరిసిల్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు... వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఊరట ఇస్తూ ఆదివారంరాత్రి, సోమవారం మధ్యాహ్నం నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం కురిసింది. సిరిసిల్లలో 17.0 మిల్లీమీటర్లు, ముస్తాబాద్‌లో 26.3 మిల్లీమీటర్లు, కోనరావుపేట 11.8 మిల్లీమీటర్లు, వేములవాడలో 6.8 మిల్లీ మీటర్ల వర్షం ఉదయం వరకు నమోదు కాగా సాయంత్రం వరకు మళ్లీ సిరిసిల్లలో 7.8 మిల్లీమీటర్లు, వేములవాడలో 7.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో బోయినపల్లి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, చందుర్తి, రుద్రంగి, తంగళ్లపల్లి తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. చెరువుల్లోకి నీరు చేరుతుంది. వీర్నపల్లిలో చెరువులు మత్తడి దూకుతున్నాయి. సిరిసిల్లలో వర్షానికి రోడ్లపై నీరు పారింది. వర్షంతో రక్షా బంధన్ వేడుకలకు ఇబ్బందులు పడ్డారు.

### వట్టెంలలో ఇళ్లల్లోకి నీరు

● వేములవాడ రూరల్: మండలంలో సోమవారం కొద్దిపాటి వర్షం కురిసింది. వట్టెంల గ్రామంలో వర్షం నీరు ఇండ్లలోకి చేరింది. గ్రామంలోని మెయిన్‌రోడ్డు సమీపంలో కొద్దిపాటి వర్షానికే నీరు ఇండ్లలోకి చేరుతుంది. రోడ్డు ఎత్తులో ఉండి ఇండ్లు దిగువన ఉండడం డ్రైనేజీలు లేకపోవడంవల్ల వర్షపునీరు ఇండ్లలోకి వస్తోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. డ్రైనేజీ నిర్మాణం చేపడితే సమస్యతీరుతుందని వెంటనే పనులను ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● వీర్నపల్లి: మండలంలో గత రెండు మూడు రోజులుగా కురిసిన వర్షాలకు సోమవారం గంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి వరద నీరు చెరువుల్లోకి వచ్చి చేరడంతో రైతన్నలు మురిసిపోతున్నారు. చెరువులలోకి వరద నీరు వచ్చి చేరడంతో జలకళ సంతరించుకుంటుంది. వరద నీటితో మద్దిమల్ల రాయిని చెరువు మత్తడి తూకుతోంది. రాయిని చెరువు గొలుసుకట్టు చెరువులు నిండనున్నాయి. చేయిజారిపోతాయనుకున్న పంటలు వర్షంతో జీవం పోసుకుంటుండగా అన్నదాతల్లో ఆశలు చిగురుస్తున్నాయి. దీంతో పాటు రంగంపేటలో జంపన్న చెరువు, అడవిపదిరలో ధర్మారపు చెరువు, వన్‌పల్లిలో హన్మాజి చెరువు వరద నీటితో నిండుకుంటున్నాయి. దీంతో రైతుల కళ్ళల్లో ఆనందం వ్యక్తమవుతుంది. రాయిని చెరువు మత్తడి దుంకడంతో కాశి తండాకు వెళ్లే దారిలో ఒర్రె ప్రవాహంతో గిరిజనులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

# వైభవంగా మార్కండేయ స్వామి రథయాత్ర



సిరిసిల్లలో శ్రీమార్కండేయ స్వామి శోభాయాత్ర



తంగళ్లపల్లిలో పద్మశాలీ సంఘం నాయకుల శోభాయాత్ర



రుద్రంగిలో పద్మశాలీల శోభాయాత్ర

సిరిసిల్ల ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శివభక్త మార్కండేయ స్వామి నామస్మరణ... శివహోం... అంటూ తరలివచ్చిన పద్మశాలీల జనసందోహం మధ్య కన్నుల పండువగా మార్కండేయ స్వామి శోభాయాత్ర శోభిల్లింది. సోమవారం సిరిసిల్ల పద్మశాలీ సంఘం, యువజన సంఘం,మహిళ సంఘం ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మార్కండేయ స్వామి దేవాలయం నుంచి బయలు దేరిన మార్కండేయ స్వామి రథయాత్ర... మగ్గం ప్రదర్శనతో సాగి పోయింది. మార్కండేయ దేవస్థానం నుంచి గాంధీచౌక్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా చేనేత విగ్రహం, పెద్దబజార్ నుంచి మార్కండేయ దేవాలయానికి శోభయాత్ర చేరుకుంది. అదర్శ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మగ్గం ప్రదర్శన నిర్వహించారు. శాంతినగర్‌లో శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో గాంధీ, అంబేద్కర్, చేనేత విగ్రహాలకు పూలమాలలు వేశారు. సిరిసిల్ల మార్కండేయ దేవస్థానంలో ఉదయమే మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి యజ్ఞోపవీత ధారణతోపాటు గణపతి పూజ, నవగ్రహ ఆరాధన, గాయత్రీ హోమం, నిర్వహించారు. శోభాయాత్రలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ అడెపు రవీందర్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, బొల్లి రామ్మోహన్, గాజుల బాలయ్య, పత్తిపాక సురేష్, మండల సత్యం , తాటిపాముల దామోదర్, కాముని వనిత, గుండ్లపల్లి శ్రీనివాస్, గుజ్జె తార, యెల్లె లక్ష్మీనారాయణ, బూట్ల నవీన్, గుండ్లపల్లి పూర్ణచందర్, కొడం శ్రీనివాస్, వెల్దండి దేవదాస్, వెంగళ శ్రీనివాస్, మోర రవి, గాజుల బాలయ్య, అడ్డగట్ల మురళి, వేముల రాములు, మండల బాలరాజు, డాక్టర్ గాజుల బాలయ్య, దార్నం అరుణ, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలంలో నూలు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తంగళ్ళపల్లి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూలు పౌర్ణమి సందర్భంగా హోమము, జంజముల పంపిణీ, శోభాయాత్ర నిర్వహించారు. అలాగే పద్మ నగర్ లో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నూలు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అలాగే జంజముల ధారణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తంగళ్ళపల్లి పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాపల్లి ఆనందం, పద్మ నగర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెఉర శ్రీకాంత్, నాయకులు మచ్చ ఆంజనేయులు, అంకారపు రవీందర్, కోడం రమేష్, సామల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ: రాఖీ పౌర్ణమి సందర్భంగా వేములవాడ పట్టణ పద్మశాలి సంఘంలో యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సుభాష్ నగర్ లోని పట్టణ పద్మశాలి సంఘ భవనములో అధ్యక్షులు అవధూత రజినీకాంత్, గాయత్రి పరివార్ జిల్లా కోఆర్డినేటర్ డా. పులి సత్యనారాయణ పర్యవేక్షణలో గాయత్రి పూజ నిర్వహించిన అనంతరం పద్మశాలి సంఘం సభ్యులు యజ్ఞోపవీతం ధరించారు. స్థానిక మార్కండేయ నగర్ లోని పద్మశాలి సంఘం కార్యాలయంలోనూ యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం సందర్భంగా ఇక్కడి సంఘం సభ్యులు జంధ్యం ధరించారు.

● రుద్రంగి : మండల కేంద్రంలో నూలు పౌర్ణమి, రాఖీ పౌర్ణమి సందర్భంగా మార్కండేయ శోభయాత్రను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఓ ట్రాక్టర్‌పై మగ్గం పెట్టి వస్త్రాన్ని నేశారు. మరో ట్రాక్టర్‌లో శంకరుడు, మార్కండేయుడు, యముడు, చిత్రగుప్తుడు, బటులు, వివిధ వేషధారణలో శోభయాత్రను గ్రామంలోని పుర వీధుల గుండా నిర్వహించారు. మార్కండేయ శోభాయాత్ర అనంతరం మగ్గంపై వేసిన వస్త్రాన్ని వేలం వేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బాసని ఓంప్రకాష్, ప్రధాన కార్యదర్శి మంచె రమేష్, మంచె రాజేశం, పిల్లమారపు ప్రవీణ్, పడాల గణేష్, మ్యాకల రమేష్, పులి రాజేష్, పడాల శంకరయ్య, ఏలిగేటి నరేష్, స్వర్గం పరాందామ్, చిప్ప సుదకార్, మ్యాకల రాజేందర్, బాసని రాజు కుమార్ పద్మశాలీ కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

● కోనరావుపేట: కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో సోమవారం మార్కండేయ స్వామి శోభాయాత్ర ఘనంగా జరిగింది. రాఖీ పౌర్ణమి సందర్భంగా నిమ్మపల్లి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్వామివారిని శోభయాత్రను నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి యేట రాఖీ పౌర్ణమి సందర్భంగా స్వామివారి శోభాయాత్ర నిర్వహిస్తామని పద్మశాలి సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘ నాయకులు పాల్గొన్నారు.